క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మండల కేంద్రంలోని దర్గా సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామెర మండలం పసరుగొండ గ్రామానికి చెందిన కొమ్ముల నగేశ్ (25) మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో తన సోదరి వివాహ వార్షికోత్సవం ఉండగా పసరుగొండ నుంచి సోమవారం సాయంత్రం బైక్‌పై వెళ్లి అర్ధరాత్రి తర్వాత తిరుగుప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో ఆత్మకూరు దర్గా సమీపానికి రాగానే వెనుక నుంచి గుర్తుతెలియని భారీ వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు 108కి సమాచారం ఇవ్వగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి సదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు సీఐ సంతోశ్ తెలిపారు.

కాంగ్రెస్ మండలాధ్యక్షుడిపై రాళ్ల దాడి



నడికూడ : మండల కేంద్రంలో సోమవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్‌పై అదే పార్టీకి చెందిన పలువురు నాయకులు రాళ్ల దాడికి పాల్పడినట్లు తెలిసింది. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ యాత్రలో పాల్గొని ఇంటికి వెళుతున్న క్రమంలో నర్సక్కపల్లి బస్టాప్ సమీపంలో గల రైస్ మిల్ వద్ద కారు, బైక్‌పై వచ్చిన నర్సక్కపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగుర్ల శ్రీనివాస్, నగేశ్, వెంకటేశ్, లోనే వెంకటేష్ అతడిపై రాళ్లతో దాడికి దిగినట్లు పలువురు నాయకులు తెలిపారు. దీంతో అతడికి తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు. దేవేందర్ భార్య, మాజీ ఎంపీటీసీ బుర్ర దీప పరకాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన భర్తకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

మే 1 నుంచి వేసవి కరాటే శిబిరం

కాజీపేట రూరల్ : కాజీపేటలో వేసవి సెలవుల ను పురస్కరించుకొని విద్యార్థిని, విద్యార్థులకు స్పార్క్స్ కాయ్ షోటో ఖాన్ కరాటే అకాడమీ ఇండియా వారు మే 1 నుంచి 25వ తేదీ వరకు ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అకాడమి ఫౌండర్ నాయిని సదానందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7:30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోచ్‌గా సి.హెచ్.దీపక్ సాయి బ్లాక్ బెల్ట్ సెకండ్ డాన్‌గా వ్యవహరించే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లు ఏప్రిల్ 30 వరకు నమోదు చేసుకోవాలని, వివరాలకు 8106460678, 984963922 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ముళ్లపొదల తొలగింపు

హసన్‌పర్తి : హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిలో హసన్‌పర్తి పెద్ద చెరువు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, దేవస్థాన కమిటీ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, మాజీ చైర్మన్ జె.రవి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, దేవస్థాన ధర్మకర్తలు సురేష్, సంతోష్, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్‌లో కుక్కల స్వైర విహారం

కాజీపేట : కాజీపేట 51వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పాదచారులు, వాహనదారులపై విరుచుకు పడుతుండటంతో గాయాల పాలవుతున్నామని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిని జనావాసాలకు దూరంగా తరలించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి తమను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన గోక్షీరాభిషేకం పూజలు

కాజీపేట : స్థానిక శ్వేతార్కమూలగణపతి దేవాలయంలో మంగళవారం స్వామి వారికి 108 లీటర్ల గోవు పాలతో క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో భక్తులు సమర్పించిన గోవు పాలతో పండితులు అభిషేకం జరిపించారు. బుధవారం నుంచి వసంతోత్సవ వేడుకలు జరగనున్న నేపథ్యంలో స్వామి వారికి క్షీరాభిషేకం చేసి ఆలయ పరిసర ప్రాంతాలను సంప్రోక్షణ చేశారు. పూజల్లో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ, సాయికృష్ణశర్మ, హరిస్వామి, దయాకరశర్మ, మణిదీప్, రవి, సుధీర్‌తో పాటు భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతికి నాడు నో.. నేడు ఓకే

- వివాదాస్పదంగా మిల్క్ పార్లర్ ఏర్పాటు
- ఆర్టీసీ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు
- అసహనం వ్యక్తం చేస్తున్న చిరువ్యాపారులు



వివాదాస్పదంగా మారిన బస్టాండ్ ఎంట్రెన్స్‌లోని మిల్క్ పార్లర్

పరకాల : బస్టాండ్ వెనుకాల ఖాళీ స్థలంలో దుకాణాల ఏర్పాటుకు ససేమిరా అనే ఆర్టీసీ అధికారులకు ఒక్కసారిగా ప్రేమ పుట్టుకురావడంపై ప్రయాణికులు, ఆర్టీసీ కార్మికులు కంగుతిన్నారు. బస్టాండ్ ఎదురుగా రోడ్డు వెడల్పులో అనేక దుకాణాలు (డబ్బాలు) కోల్పోయిన చిరువ్యాపారులు, బస్టాండ్ వెనుకాల ఉన్న ఖాళీ స్థలంలో దుకాణాల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని పలువురు దుకాణాదారులు గత పాలకులకు, ఆర్టీసీ అధికారులకు విన్నవించుకున్నారు. అయితే బస్సులు లోపలికి వచ్చే ప్రదేశాల్లో దుకాణాలు ఏర్పాటు చేయడం వలన ప్రమాదాలు జరుగుతాయని, ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇచ్చేది లేదని పరకాల బస్టాండ్ పరిశీలనకు వచ్చిన ఆర్టీసీ ఉన్నతాధికారులు (ఈడీ) స్పష్టం చేశారు. దీంతో ఆయా ప్రాంగణంలో మొక్కలు నాటి బస్టాండ్ ఆవరణాన్ని పచ్చదనంగా మార్చారు. కానీ ప్రస్తుతం నిబంధనలకు విరుద్ధంగా ఆర్టీసీ అధికారులు బస్టాండ్ ఎంట్రెన్స్‌లోనే మిల్క్‌పార్లర్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంపై పలు విమర్శలు వస్తున్నాయి. ఈ విషయాన్ని ప్రశ్నించిన తమపై ఆర్టీసీ డీఎం దురుసుగా మాట్లాడినట్లు స్థానిక మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారితో పాటు మరికొందరు ఆరోపించారు. 'బస్టాండ్‌లో ఏమి చేయాలో మాకు తెలియదా.. మీరు మాకు చెప్పడం ఏంటని ఏదైనా ప్రమాదాలు జరిగితే తానే బాధ్యత వహిస్తా' అంటూ సమాధానం ఇచ్చినట్లు వారు తెలిపారు. ఆర్టీసీ అధికారులు ఇష్టానురీతిగా వ్యవహరించినట్లు ఆరోపించారు.

అనుమతి ఇచ్చాం, దారి ఇవ్వలేదు



పరకాల బస్టాండ్ ఎంట్రెన్స్‌లో విజయ మిల్క్ పార్లర్‌కు అనుమతి ఇచ్చిన మాట నిజమే. కానీ కొనుగోలుదారులు ఏవరు బస్టాండ్ లోపలికి వచ్చి కొనుగోలు చేయకుండా వాహనాలు పార్కింగ్ చేయకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాం. ఏలాంటి ప్రమాదాలు జరుగకుండా చూస్తాం.

– రవిచంద్ర, ఆర్టీసీ డీఎం

సంక్షిప్తంగా

ఫొటోథెరపీ సేవలు ప్రారంభం

కమలాపూర్ : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో ఫొటోథెరపీ సేవలు ప్రారంభించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేశ్ మంగళవారం తెలిపారు. నవజాత శిశువులకు పస్కలు (కామెర్లు) ఉంటే ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చిన ఫొటోథెరపీ ఉచిత సేవలు వినియోగించుకోవాలన్నారు.

పద్మశాలి సంఘం మండల కమిటీ ఎన్నిక



శాయంపేట : అఖిల భారత పద్మశాలి సంఘం మండల కమిటీని ఆ సంఘం జిల్లా కార్యదర్శి దిడ్డి రమేశ్, మండల అధ్యక్షుడు వంగరి సాంబయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వంగర సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా చిందం రవి, ముదిగొండ సంతోశ్, ప్రధాన కార్యదర్శిగా సామల ధనుంజయ్, సహాయ కార్యదర్శులుగా మోత్కూరి సత్యనారాయణ, కుసుమ చంద్రమౌళి, కొండా ముకుందం, కార్యనిర్వాహణ కార్యదర్శిగా బాసాని మల్లికార్జున్, కోశాధికారిగా దిడ్డి ప్రభాకర్, ప్రచార కార్యదర్శిగా వలుపదాసు రామును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా ప్రచార కార్యదర్శి బాలకృష్ణ, మహిళా మండల అధ్యక్షురాలు శాంత, గ్రామ అధ్యక్షుడు ప్రకాశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి ఒకరి సస్పెన్షన్

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పోడిశెట్టి గణేశ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నందున పార్టీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

నివాళి



ఐనవోలు : మండలంలోని నందనం గ్రామానికి చెందిన దొనికెన చిన్నకొమురయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మంగళవారం చిన్నకొమురయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బోయినపెల్లి శ్రీనివాసరావు, బుర్ర రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

దామెర : బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని సూర్య ట్రస్ట్ చైర్మన్ గజ్జి విష్ణు అన్నారు. మండలంలోని పసరగొండకు చెందిన కొమ్ముల నగేశ్ (24) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న విష్ణు మంగళవారం నగేశ్ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం ఆర్థికసాయం అందించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట సూర్య ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సురేశ్, గ్రామస్తులు ఉన్నారు.

విద్యాసాగర్‌రావుకు ఘన నివాళి

హన్మకొండ : తెలంగాణ తాగునీటి తండ్లాట తీర్చేందుకు ఆర్.విద్యాసాగర్‌రావు విశేష కృషి చేశారని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో విద్యాసాగర్‌రావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యాసాగర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యాసాగర్‌రావు కేంద్ర జల కమిషన్‌లోని జలవనరుల మంత్రిత్వ శాఖకు చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతానికి నీటి కేటాయింపులో జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపడంలో కీలకపాత్ర పోషించారన్నారు. రాష్ట్రంలో నీటిపారుదల రంగానికి ఆయన చేసిన అపారమైన కృషికి డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి విద్యాసాగర్‌రావు డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం అని పేరు పెట్టారన్నారు. ఫ్లోరైడ్ ప్రభావిత నల్గొండ జిల్లాకు సురక్షితమైన తాగునీటి కోసం, తెలంగాణ ప్రాంతంలోని శుష్క భూములకు నీటిని అందించాలని ఆయన పోరాడారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్ చెన్నం మధు, నాయకులు అనిల్, నయీముద్దీన్, వెంకన్న, వినీల్ రావు, రమేష్, రాకేష్ యాదవ్, శ్రీకాంత్ చారి, రఘు, సంపత్, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

హన్మకొండ : సమ్మయ్యనగర్‌లోని ఇంజనీరింగ్ కాలనీలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సమ్మయ్యనగర్‌లో ఈ మేరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కేయూ ప్రొఫెసర్ శ్రీనివాస్ సీపీఎం జిల్లా కమిటీ నాయకులు ఎం.చుక్కయ్య, జి.వెంకట్ దీక్షలకు సంఘీబావం తెలిపారు. దీక్షల్లో సీపీఎం హనుమకొండ పశ్చిమ మండల కమిటీ కార్యదర్శి వీరన్న పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల ధర్నా

కేయూ క్యాంపస్ : రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కాకతీయ యూనివర్సిటీలోని పార్ట్‌టైం అధ్యాపకులు క్యాంపస్‌లోని పరిపాలనా భవనం వద్ద ధర్నా నిర్వహించారు. మధ్యాహ్నం భవనం ప్రాంగణంలోనే భోజనం చేస్తూ తమ నిరసన తెలిపారు. పార్ట్‌టైం అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు , బాధ్యులు డాక్టర్ నరేందర్ నాయక్, రాజేందర్, శ్రీకాంత్, మోహన్, శ్రీధర్,రాంమోహన్, శ్రీనివాస్, హరికుమార్, మాధవి, విజయ, సంధ్య పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

రామన్నపేట : మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు వరంగల్ జిల్లా కోర్టు జడ్జి అబ్బోజు వెంకటేశం జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు. దుగ్గొండి మండలం వెంకటాపూర్‌కు చెందిన బొమ్మగాని రాజేశ్‌కు రెండు రోజులు, వరంగల్ పెరికవా డకు చెందిన చింతనూరి శ్రీనివాస్‌కు మూడు రో జు ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పులో పేర్కొన్నట్లు తెలిపారు. వీరిని హుజూరాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు వివరించారు. అలాగే డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 16 మందికి రూ.19,700 జరిమానా విధించినట్లు తెలి పారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి రూ2,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు వివరించారు.

అధికారిక కార్యక్రమంలో ఫ్లెక్సీ రగడ

కనిపించని ఎమ్మెల్సీ పోచంపల్లి ఫొటో



భూ భారతి చట్టం అవగాహన సదస్సులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఖిలా వరంగల్ : వరంగల్ ఉర్సుగుట్ట నాని గార్డెన్‌లో జిల్లా కలెక్టర్ సత్యశారద ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో ఫ్లెక్సీ రగడ ఉవ్వెత్తున ఎగిసిపడింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఫొటో ఫ్లెక్సీలో లేకపోవడంతో పలువురు ఆవేదన వెలిబుచ్చారు. ఫ్లెక్సీలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు సారయ్య, తీన్మార్ మల్లన్న ఫొటోలు పెట్టి ఎమ్మెల్సీ పోచంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి ఫొటో పెట్టకపోవడంతో పెద్ద దుమారం లేపింది. అంతేకాదు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే నాగరాజు, ప్రకాశ్‌రెడ్డి ఫొటోలు ఫ్లెక్సీలో పెట్టినప్పుడు వరంగల్ జిల్లా ప్రామాణికంగా తీసుకుంటే నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఫొటో పెట్టకపోవడంతో కాంగ్రెస్‌లో మరోసారి నేతల మధ్య విబేధాలు బయటపడ్డాయి. ఫ్లెక్సీని చూసిన పార్టీ శ్రేణులు అధికార వర్గాలను ప్రశ్నించారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె

- సీఎం, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత



సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న కమిటీ బాధ్యులు

కేయూ క్యాంపస్ : రాష్ట్రంలో గల యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కేయూలోని పరిపాలనా భవనం వద్ద కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేస్తున్న సమ్మె మంగళవారంతో 11వ రోజుకు చేరింది. ఈ శిబిరంలో కేయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ బాధ్యులు శ్రీధర్ కుమార్‌లోథ్, ఆశీ ర్వాదం, ఏటీబీటీ ప్రసాద్, గడ్డం కృష్ణ మాట్లాడు తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ బాధ్యులు కనకయ్య, సతీష్, సూర్యనారాయణ, చంద్రశేఖర్, ప్రసాద్, వీణ, కవిత, రాజు, రఘువర్ధన్‌రెడ్డి, భాగ్య శ్రీలత, శ్రీదేవి పాల్గొన్నారు. తొలుత వర్ధన్నపేట ఎ మ్మెల్యే కేఆర్ నాగరాజును కలిసి వినతిపత్రం సమర్పించారు.

సీఎంకు వినతిపత్రం అందజేత

రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని కేయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల కో ఆర్డినేషన్ బాధ్యులు సోమవారం రాత్రి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించి వినతిపత్రం సమర్పించారు. కమిటీ బాధ్యులు డాక్టర్ సాధు రాజేష్, డాక్టర్ జూలసత్య, డాక్టర్ నాగయ్య తదితరులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తగిన న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు ప్రొఫెసర్ల సమస్యలు తన దృష్టికి వచ్చాయని సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారిస్తామని హామీ ఇచ్చినట్లు కోఆర్డినేషన్ జేఏసీ బాధ్యులు మంగళవారం తెలిపారు.

జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

నయీంనగర్: బహుజన మహనీయుల జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని జయంతి కమిటీ నాయకులు జిల్లపెల్లి సుధాకర్, జి.శ్రీనివాస్ కోరారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేడు (బుధవారం) సాయంత్రం 5 గంటలకు సమ్మయ్యనగర్ హనుమకొండలో నిర్వహించనున్న జయంతి ఉత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్‌ను రద్దు చేయాలి



హసన్‌పర్తి : ఉపాధి హామీ కూలీల హక్కులను హరించే విధంగా తీసుకొచ్చిన నేషనల్ మొబైల్ మా నిటరింగ్ సిస్టంను (ఎన్ఎంఎంఎస్) రద్దు చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. మండలంలోని జయగిరిలో ఉపాధి కూలీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఇచ్చిన పనిముట్లు తుప్పు పట్టాయని చెప్పారు. కొత్త కూలీలకు జాబ్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. పనిదినాలను 100 రోజుల నుంచి 200 రోజులకు పెంచాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లకు వెంటనే వేతనాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నాలుగు నెలల నుంచి వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

- అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు



చేపల చెరువు పనులు పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు

కమలాపూర్ : వేసవి కాలం దృష్ట్యా అన్ని గ్రామాల్లో ప్రతిరోజు ఉదయం 6 గంటలకే ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని, పని ప్రదేశాల్లో తప్పనిసరిగా నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స సౌకర్యాలు కల్పించాలని అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని వంగపల్లిలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న చేపల చెరువును ఎంపీడీఓ గుండె బాబుతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో కనీసం 200 మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు. ఉపాధి కూలీలకు కొలతలపై ఫ్లెక్సీలు, చాటింపు ద్వారా అవగాహన కల్పించి రూ.307 కూలి గిట్టుబాటు అయ్యేలా కొలతల ప్రకారం పని చేసేలా చూడాలని అన్నారు. ఉపాధి హామీలో ఉన్న అన్ని రకాల పనులు తప్పనిసరిగా చేయించాలన్నారు. ఇంటింటా ఇంకుడు గుంత, వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరిగా వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణం చేపట్టాలని, ప్రభుత్వ బోర్ల వద్ద రీచార్జ్ స్ట్రక్చర్ ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశించిన పనిరోజుల ప్రకారం అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ సిబ్బంది నడుచుకోవాలని అన్నారు. లేనిపక్షంలో సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ డీటీసీ శ్రీధర్, ఏపీఓ రమేశ్, ఈసీ కార్తీక్, టీఏ మానస, పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, కూలీలతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఇంద్రసేన

కమలాపూర్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలని అంబేడ్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు కొత్తూరి ఇంద్రసేన అన్నారు. మండలంలోని కానిపర్తిలో అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిట్యాల బాబు, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామెర లక్ష్మణ్ బోధి సోమవారం రాత్రి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ పౌరుడికి హక్కులు, స్వేచ్ఛను పంచిన అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంబేడ్కర్ అందరివాడని, ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. అంబేడ్కర్ విగ్రహ కమిటీ ఉపాధ్యక్షులు, సభ్యులు, అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు, అంబేడ్కరిస్టులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండించకపోవడం విడ్డూరం



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఆత్మకూరు : జమ్ము కాశ్మీర్‌లో ఇటీవల హిందువులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని మాజీ సీఎం కేసీఆర్ ఖండించకపోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కాశ్మీర్‌లో హిందువులపై జరిగిన దాడిని ప్రపంచ దేశాలకు ఖండించినప్పటికీ బీఆర్ఎస్ నేతలు గమ్మున ఉండడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు సదానందం, ప్రధాన కార్యదర్శి పైడి, బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కుప్పలతో పొంచి ఉన్న ప్రమాదం



మల్లికుదుర్ల-షోడాషపల్లి రోడ్డుపై ధాన్యం కుప్పలు

వేలేరు : ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తుండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు రోడ్డుపై ధాన్యం కుప్పలు ఆరబోయడంతో రాత్రిపూట ప్రయాణించే వాహనదారులకు కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

మార్చురీలో నూతన ఫ్రీజర్లు ఏర్పాటు చేయాలి



సూపరింటెండెంట్ డాక్టర్ సాయికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఎంజీఎం : ఎంజీఎం మార్చురీలో ఫ్రీజ్ బాక్స్‌లు పని చేయకపోవడంతో పార్థివదేహాలు త్వరగా డీ కంపోజ్ అవుతున్నాయని వెంటనే నూతన ఫ్రీజ్ బాక్స్‌లను లేదా ఉన్న బాక్స్‌లను మరమ్మతు చేయించాలని తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ అధ్యక్షుడు కె.మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ సాయికుమార్, ఆర్ఎంఓలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ పార్థివదేహాలను వైద్య విద్య నిమిత్తం మెడికల్ కాలేజీలకు అప్పగిస్తుంటే నాణ్యత కోల్పోవడంతో అవి మెడికల్ చదువులకు, శాస్త్ర పరిశోధనకు ఉపయోగపడటం లేదన్నారు. నేత్రాల సేకరణ సమయంలో కూడా కార్నియాలో కంటి పొరలు నాణ్యత లోపించడంతో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ఉపయోగపడటం లేదని తెలిపారు. మార్చురీలో కొత్త స్ట్రెచర్స్, చేతుల పరిశుభ్రతకు సింక్‌ల్లో నీటి సౌకర్యం, లోపల, బయట సరిపడా లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. నిల్వ ఉంచిన దేహాలను జీడబ్ల్యూఎంసీ సిబ్బంది వెంటనే తీసుకుపోయేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆస్పత్రిలో వయో వృద్ధులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రేమ్‌కుమార్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం పరిశోధకుడు ప్రేమ్‌కుమార్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. మల్టికల్చరలిజమ్ ఇన్ నేయిల్ బిసూందత్స్ ఫిక్షన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ఆచార్యులు పాల్గొన్నారు.